'అవును—ఒక్కటే'

'ప్రభూ!'

'శేషయ్యా!'

'గొప్ప పొరబాటు చేశారు—'

'ఏమిటది—ఏమిటోయ్ శేషయ్యా?'

'శుద్ధ చవట పెద్దమ్మ పని చేశారు—'

'నా మొహం! వెర్రివెధవని! ఏం చేశానో చెప్పు—'

'ప్రభూ పశ్చాత్తాపానికి వ్యవధిలేదు'

'మరి ఏం చెయ్యమంటావ్?'

'ఈ దీపావళి ఘడియలు దాటిపోకుండా మీ కోరిక సిద్ధించాల్నంటే—'

'ఈవేళ సాయంత్రానికేనా నేను నా జహంగీరు నెక్కి షికారు చెయ్యాల్నంటే—'

'ఒక్కటే మార్గం—'

'ఏమిటదీ—త్వరగా?'

'తమరు వెంటనే ఒక నూర్జహానును వెతికితెచ్చి జహంగీరుకు కానుక పెట్టాలి—'

## కొత్త సలహాదారుడి నియామకం

'శేషయ్యా?'

'ప్రభూ!'

'ఎవరోయి ఈ అసామీ?'

'చిత్తం-బొంబాయినుంచి వచ్చాట్టండి-ఏవో టాయ్ లెట్ సామాన్లు-పైపూతలూ, మెరుగులూ-తయారుచేసే కంపెనీకి ఏజంటుటండి-'

'ఏమంటాడు ఇంతకీ-'

'తన కంపెనీ సరుకులను ప్రోత్సహించమని తమర్ని వేడుకుందుకు వచ్చాట్టండి-'

'ఏమిటో ఆసరుకులు-చూడకుండా, మనకి అవసరమో లేదో తెలుసు కోకుండా-?'

'చిత్తం! ఆ తోలు పెట్టెనిండా శాంపిల్సు వేసుకు వచ్చాడండి-తమరికి చూపెట్టడానికి-'

'చూపమను-'

*   *   *

'ఇవి ముఖ్యంగా తమ దేవిగారికి అత్యవసరమైనవనీ, ఆమె మాసి పరీక్షించదగినవనీ చెబుతున్నాడండి-'

'అయితే నాకు పనికొచ్చేవేవీ లేవన్నమాట అతడి దగ్గర-''

'తమకీ పనికివస్తాయండి-కాని, ఇవి ముఖ్యంగా ఆడవారి సౌందర్యం ఇనుమడింప జేయడానికి ఉపయోగిస్తాయిటండి-దేవిగారికి కబురు చేయిస్తాను-ఆవిడ వచ్చిచూసుకుంటారు-'

*   *   *

'శేషయ్యా! దేవి వచ్చింది-ఇద్దరంకూడా చూస్తాం-తోలుపెట్టె విప్పమను-'

చిత్తం-'

'అదేమిటిట?'

'దేవిగారు అత్యవసరంగా ఉపయోగించాల్సిన ఆరు పై పూతలలోనూ ఇది మొదటిదని చెబుతున్నాడండి-ఏజంటు-'

'ఓహో!'

'ఇది కొంచం జిడ్డుగా వుంటుందిటండి-దీన్ని కోల్డు క్రీం అని అంటారుట. ఇది రాత్రి నిదురించేముందు ముఖానికి పులుముకుంటారుటండి సౌందర్యవతులు-'

'సౌందర్యవతులు-అవును-దేవి సౌందర్యవతే-కాదు శేషయ్యా?'

'చిత్తం చిత్తం! కాదని ఎవరన్నారండి?'

'సరి! ఆ పైన?'

‘ప్రొద్దుటికి ముఖంలోవుండే దోషాలన్నీ హరించి పోతాయిటండి-’

‘రాత్రి పూసుకొన్న ఆ జిడ్డుతో - అంతేకదూ అతడనేదీ ?’

‘చిత్రం చిత్రం! ఆపైన ఉదయం కాగానే-దేవిగారు హంసతూలికా తల్పం మీంచి లేవగానే సబ్బుతో ఆ జిడ్డంతా పోగొట్టు కోవాల్నటండీ’’ .

‘అవును. పోగొట్టుకోవాలి-ఆ జిడ్డు.’

‘ఆపైన-ఈ రెండో సీసాలోని-వేనిషింగ్ క్రీం-ఇది పూయగానే అదృశ్యమై పోయి-ఆహ్లాదాన్నిస్తుందిటండి-’

‘అదీ జిడ్డుగానే వుంటుందా ?’

‘ఉండదుటండి. పూసీ పూయడంతోనే అదృశ్యమై పోయి-’

‘ఆహ్లాదకరంగా వుంటుంది-కదూ ?’

‘అవునండి. ఆపైన - ఈ డబ్బాలోనున్న పౌడరు-ముఖానికి అద్దుకొంటారుటండి - సౌందర్యవతులు-’

‘దేవి సౌందర్యవతే - తప్పకుండా అద్దుకొంటుంది-సరే! ఆతర్వాత?’

‘దీన్ని లిప్‌స్టిక్ అంటారుటండి - ఏజంటు చెబుతున్నాడు-దీన్ని పెదిములకు పట్టిస్తే పెదిమలు లక్కలాగ అవుతాయిటండి-’

‘తెలుసు తెలుసు-ఆ మధ్య గవర్నరు పెళ్లాం వేసుకోగా చూశాను-అవును. లక్కలాగే వుంటాయి పెదిమలు-’

దీన్ని చెక్కిళ్ళలోకికూడా కొస్త మర్దనాచేస్తే కెంపులు తాటించినట్టుగా వుంటాయిటండి సౌందర్యవతుల మొహాలు-’

‘ఉండవల్సిందే-’

‘ఆపైన-ఇది నెయిల్ పాలిష్ అనేదిటండి-దీన్ని పూస్తే నఖాలు ఎఱ్ఱగా ఆరుద్ర పురుగులలా వుంటాయిటండి-’ -

‘నిజమే. ఇన్నాళ్ళనుంచీ వీటి ఉపయోగమే ఎరగదు దేవి-పిచ్చిపిల్ల! అవన్నీ ఏమిటి ?’

‘ఏవేవో సబ్బులూ, రక్తస్రావాన్ని అరికట్టే మందులూ, సెంట్లూ, తలనూనెలూ - రకానికి ఒక్కొక్కటి పరీక్షించండి-’

'బావున్నాయి!'

'ఇది వేనిటీ బేగ్ టండి-సౌందర్యవతుల హస్తభూషణంట-'

'చక్కగా వుంది, ముద్దొస్తూంది-'

'దేవిగారు దీన్ని చాలా ప్రేమిస్తారని చెబుతున్నాడండి ఏజంటు-'

'ఇంకా ఏమంటాడు?'

'తొందరపడ వద్దంటున్నాడండి-'

'ఇంకా ఏమైనా చూబిస్తాడటనా?'

'ఏవేవో ప్రఖ్యాత సుందరీమణుల ఫోటోలూ, అభిప్రాయాలూ చూబించి, వినిపిస్తున్నాడండి-'

* * *

'ఈ ఫోటోలలో వారంతా ఇంత సౌందర్యం కలిగివుండటం ఈ కంపెనీవారి దయవల్లనే అనీ, వారు ఇచ్చిన అభిప్రాయాలన్నీ భావి సౌందర్యవతుల అభ్యున్నతికి తోడుపడతాయనీ నేను తప్పకుండా నమ్ముతున్నాను శేషయ్యా-'

'హృదయపూర్వక వందనాలు తమకి సమర్పించ మంటున్నాడండి ఏజంటు.'

'సంతోషం.'

'తమరి సెలవైతే దేవిగారికి ఏవో కొన్ని సలహాలు ఇవ్వదలుచు కున్నాట్టండి-'

'ఏమిటనీ-కానిమ్మను త్వరగా-'

'దేవిగారు ప్రపంచ మహా సౌందర్యవతులలో మిన్నగా భావింప బడాల్నంటే ఆమె ఎప్పుడూ ఈ కంపెనీ సరుకులను విడిచి వుండకూడ దంటాడండి-'

'ఊ!'

'యుద్ధకాలమైనప్పటికీ దేవిగారికి కావలసినంత ఈ టాయిలెట్ సామగ్రి విరివిగా సరఫరా అయ్యేటట్టుగా కంపెనీవారితో మాట్లాడి ఏర్పాటుచేస్తానని వాగ్దానం చేస్తున్నాడండి-'

'చేస్తున్నాడా - సరే!'

'దేవిగారు మాత్రం ఈ ముద్దులు మూటగట్టే వేనిటీ బేగ్ ను ఇరవై నాలుగ్గంటలూ తమ దగ్గరనే ఉంచుకుని, దాన్ని ఎప్పుడూ నిండుగా వుంచి, దినచర్యలలో, సాంఘిక కార్యక్రమాలలో, ఇంటా, వంటా, బయటా, అంతటా ఎప్పుడూ ఈ సౌందర్య సామగ్రిని ఉపయోగిస్తూ వుండాలని సలహా ఇస్తున్నాడండి-'

'సరే, ఇంకా ఏమంటాడు?'

'ఎవరేనా సౌందర్యవతులు దేవిగారిని చూడవచ్చినా, దేవిగారే బయలుదేరి ఎవరేనా సౌందర్యవతులను చూడబోయినా సౌందర్యం తగ్గిపోకండా అడపా తడపా, కనీసం అయిదు నిమిషాల కొకమారు ఈ సాధన సామగ్రులను ఉపయోగిస్తూ వుండవల్సిందని హెచ్చరిస్తున్నాడండి-'

'ఊ-'

'వీటన్నిటిలోనూ ఈ పౌడరు గుణాలు చాలా మహిమాన్వితమైనవనీ, ఎందరో సౌందర్యవతుల పరువు మర్యాదలను ఇది అనేక క్లిష్ట పరిస్థితులలో కాపాడివున్నదనీ, దన్ని కాదని ఏ సౌందర్యవతీ అయిదు నిముషాలపాటు సౌందర్యవతిగా ఉండలేదనీ. ఎవరితో ప్రసంగిస్తున్నా సరే, ఏమి చేస్తున్నాసరే ఒక్కమారు చాటుగా వెళ్ళే అవకాశం చేసుకుని ఇది కాస్త కాస్త ముఖానికి అద్దుకుని వస్తూండాలనీ ఏజంటు తిరిగి హెచ్చరిస్తున్నాడండి-'

'ఎంత మంచివాడు!'

'ఇలాగ అనేక విధాల ఈ సామగ్రులను ఉపయోగిస్తూ, సౌందర్యం విషయంలో అప్రమత్తతగలిగి ప్రవర్తిస్తూవుంటే-శ్రీ కంపెనీవారి దయ వలన దేవిగారికి త్వరలోనే అంతర్జాతీయ అఖండ సౌందర్యవతుల సౌందర్యపోటీలో ప్రథమ బహుమానం లభించవచ్చని అభిప్రాయపడుతూ ఈ ఏజంటు ఇంతటితో ఈ ఆర్డరు ఫారంమీద తమ దస్కత్తును వుంచి అడ్వాన్సును దయచేయమని కోరుతున్నాడండి-'

'చాలా మంచివాడోయ్ శేషయ్యా!'

'అవునండి.'

'అయితే శేషయ్యా-దేవి ఏమిటో అంటూందిచూడూ-'

'ఇవన్నీ ఏమిటో ఆవిడకి చాలా గందరగోళంగానూ, బాదరబందీగానూ కనిపిస్తూన్నాయని శెలవిస్తున్నారండి దేవిగారు.'

'పిచ్చి పిల్ల!'

'ఇవన్నీ ఉపయోగించాల్సిన అవసరం ఆమెకు కలగలేదనీ, ఆమె సౌందర్యం ఇవన్నీ లేకుండానే వర్ధిల్లగలదనీ దేవిగారు అభిప్రాయపడుతున్నారండి-'

'వెఱ్ఱి అమాయకురాలు - ఏజంటు నించున్నాడు పాపం!-'

'ముఖానికి జిడ్డు పూసుకుని, సబ్బుతో దాన్నికడిగి, ఆ తర్వాత మరొకటేదో పూసి, దానిపైన ఏదో జల్లి ఆహ్లాదం, అందం తెచ్చిపెట్టుకోవలసినంత అవసరం ఆమెకు లేదనీ, గోరింటాకుతో వ్రేళ్ళనూ, తోటలో పూసిన సంపెంగల తైలంతోనూ, జాజి, పువ్వు వెలగ, రోజా మొదలైన పుష్పాలతోనూ శిరోజాలను అలంకరించుకొనే నేర్పు, అవకాశం ఆమెకు పూర్తిగా వుందనీ, అందుచేత ఈ ఏజంటును వెంటనే పంపించెయ్యమనీ దేవిగారు శెలవిస్తున్నారండి-'

'పిచ్చి పిల్ల! దానికేమి తెలుసునోయి శేషయ్యా?'

'ఏమోనండి! ఏజంటును వెళ్ళిపొమ్మంటేనే మంచిదేమో!'

'దాని పిచ్చిని నువ్వు ఎగసన దోస్తున్నావు - శేషయ్యా! క్రిందటి వ్రాటీ సీజన్‌లో ఇవన్నీ ఉపయోగించడం చాతగాక దేవి దెబ్బతింది - ఈమారు అలా జరగనిస్తానా - ఆ ఏజంటును ఒక నెల ఇక్కడే వుండి పొమ్మను - మన ఖర్చులమీద!'

'చిత్తం! ప్రభువువారి శెలవు! అయితే అతడికూడా ఒక బెర్తు రిజర్వు చేయిస్తానండి - వ్రాటీకి!'